

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



అల్లాదుర్గంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

# స్కందమాతగా దుర్గమ్మ

- కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు
- సామూహిక కుంకుమార్చనలు, అన్నదానాలు

చిలిపిచెడ్/నిజాంపేట/అల్లాదుర్గం/పాపన్నపేట/పెద్దశంకరంపేట, అక్టోబర్ 19: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారు మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో ఐదో రోజు గురువారం నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం పోసి మొక్కలు చెల్లించుకున్నారు. అలయ ఆవరణలో భక్తులు కొత్త వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఉత్సవాలకు భక్తు లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నా రు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో నిర్వహించారు.



చిలిపిచెడ్: భక్తులకు దర్శనం ఇస్తున్న చాముండేశ్వరి అమ్మవారు

☛ దుర్గాదేవి నవరాత్రోత్సవాలు భక్తశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని జగ్గంపేట, అజ్జమర్రి, అంతారంలో దుర్గామాత మండపాల వద్ద మహిళలు గురువారం అమ్మవారికి పట్టు వస్త్రాలు, గాజులు, ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. జగ్గంపేట, అజ్జమర్రి గ్రామాల్లో దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

☛ నిజాంపేటలోని స్థానిక హనుమాన్ ఆలయంలో దుర్గమాత ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు చండీహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దుర్గమాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు నాగరాజు, తిరుపతి, స్వామి, వెంకటేశం, లక్ష్మణ్, శివ ఉన్నారు.

☛ అల్లాదుర్గం మండలంలోని రెడ్డిపల్లి, గడిపెద్దాపూర్, అల్లాదుర్గం గ్రామాల్లో గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అల్లాదుర్గంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ఐదవ రోజు స్కంధ మాత దేవిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



జగ్గంపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న మహిళలు

☛ ఏడుపాయల వనదుర్గా భవానీమాత గురువారం ఐదవ రోజు స్కంద మాత (మహాలక్ష్మి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణలో భాగంగా గురువారం అమ్మవారిని నూతన కరెన్సీ(రూపాయల) నోట్లతో అలంకరించారు. కరెన్సీ అలంకరణ అనంతరం మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏడుపాయల్లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి కోరారు.

☛ పెద్దశంకరంపేట పట్టణంతో పాటు మండలంలో ప్రతిష్ఠించిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తిరుమలాపురంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద గురువారం ఎంపీపీ జంగం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు కందుకూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో దుర్గామాత అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్



కొల్చారం: వరిగుంతంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో బోనమెత్తిన జడ్పీటీసీ మేఘమాల



చండీహోమంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు



గజ్జెల నగేశ్‌ను సన్మానిస్తున్న ఉపాసకులు వెంకటేశ్వరశర్మ

## సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారు

- రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్

శివ్వంపేట, అక్టోబర్ 19: శివ్వంపేటలో కొలువుతీరిన బగలాముఖి శక్తిపీఠాన్ని గురువారం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గజ్జెల నగేశ్ మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో విజయదుందిభీ మోగించి హ్యాట్రిక్ సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.



ఫైజాబాద్ భజన మండలి సభ్యులకు బహుమతితో పాటు రూ.5 వేల నగదు అందజేస్తున్న శ్రీదుర్గా మారుతీ సభ్యులు

## భజన మండలి పోటీల్లో ఫైజాబాద్ ప్రథమం

చిలిపిచెడ్, అక్టోబర్ 19: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లిలో శ్రీదుర్గా మారుతీ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో భజన మండలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జిల్లాలో ఆయా గ్రామాల్లో నుంచి వచ్చిన 10 భజన కమిటీలు పాల్గొన్నారు. చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామ 'హనుమాన్ భజన మండలి' కమిటీ సభ్యులు పాల్గొన్ని జిల్లాలో మొదటి స్థానంలో గెలుపొందారు. జిల్లాలో మొదటి స్థానంలో గెలుపొందిన ఫైజాబాద్ భజన మండలి సభ్యులను సన్మానం చేసి రూ.5 వేలతో పాటు బహుమతులు అందజేసినట్లు భజన మండలి సభ్యుడు జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు వీరేశం, రాములు, అశ్విన్ రెడ్డి, రవి, సుభాశ్, కుమార్, దస్తగౌడ్, విఠల్, యశ్వంత్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.80 వేల నగదు సీజ్

అల్లాదుర్గం, అక్టోబర్ 19: మండంలోని రాంపూర్ వద్ద గురువారం రూ.80వేల నగదును అల్లాదుర్గం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. రోజువారి తనిఖీల్లో భాగంగా రాంపూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నారాయణఖేడ్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మారుతి ఓమినీ తనిఖీ చేయగా , అందులో ఉన్న రూ.80వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాలు అడగ్గా వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకుళ్తున్నాని మహ్మద్ అలీ తెలిపారు. వ్యాపారానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసి, సంగారెడ్డి జిల్లా ట్రెజరీలో జమ చేయనున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

శివ్వంపేట, అక్టోబర్ 19: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికాంత్‌రావు కథనం ప్రకారం శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన సుందరముల పెంటయ్య (63) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ఉన్న ఎల్‌టీ లైన్ తెగడంతో గమనించని పెంటయ్య విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పెంటయ్య శవమై కనిపించడంతో విషయం పోలీసులకు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

## నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతనివ్వాలి

**మహిళలకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీలో రామాయంపేట సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి**

రామాయంపేట, అక్టోబర్ 19: ప్రభుత్వ దవాఖానలలోనే ప్రసవాలు జరగాలని, అదికూడా ఎక్కువ శాతం నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతను ఇవ్వాలని రామాయంపేట సీహెచ్‌సీ దవాఖాన వైద్యులు లింబాద్రి పేర్కొన్నారు. గురువారం రామాయంపేట సెక్టార్ పరిధిలోని రామాయంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట, నిజాంపేట, డి.ధర్మారం మండలాలకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను పరిశీలించారు.అనంతరం వైద్యులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ప్రతి ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యను కల్పించేలా ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు నిత్యం అందుబాటులోనే ఉండాలన్నారు. ఏ రాత్రి ఎలాంటి ఇబ్బందులున్నా 108 అంబులెన్సుకు సమాచారం అందించి ప్రభుత్వ దవాఖానలో చేర్పించి వైద్యం అందించాలన్నారు. ఆరోగ్య కిట్లలో అన్ని రకాల మందులు ఉంటాయని, గర్భిణులకు కచ్చితంగా కిట్లను అందజేయాలని సూచించారు. నార్మల్ డెలివరీ సాధ్యం కాని పరిస్థితిలో సీజేరియన్‌కు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రామాయంపేట డి.ధర్మారం, నిజాంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట ప్రభుత్వ వైద్యులు హరిప్రియ, జయలక్ష్మి, ప్రదీప్ తదితరులు ఉన్నారు.



రామాయంపేటలో మహిళలకు ఆరోగ్య కిట్లను అందిస్తున్న సీహెచ్‌సీ డాక్టర్ లింబాద్రి



చిలపిచెడ్, అక్టోబర్ 19: మండలంలోని గంగారం గ్రామంలో మన్నె పెద్ద దుర్గయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రూ.9 వేల నగదు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.